


దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం


కంప్లి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): హంపి ఉత్సవాల్లో వస్తు ప్రదర్శన ఇతర దుకాణాల ఏర్పాటు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హంపి ముఖ్య ఉప సమితి అధ్యక్షుడు, విజయనగర జిల్లా వ్యవసాయ శాఖాధికారి శరణప్ప ముదిగల్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 28 నుంచి మార్చి 2 వరకు సాగే ఉత్సవాల్లో షాపుల ఏర్పాటుకు అనుమతి ఇస్తామన్నారు. రూ. ఐదు వేలు డిపాజిట్‌గా డీడీలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈనెల 15వ తేదీలోగా దరఖాస్తులు పంపాలని ఆయన తెలిపారు.


చాళుక్య సర్కిల్‌లోని బసవణ్ణ విగ్రహం


మెజస్టిక్ సమీపాన సంగొళ్ళిరాయణ్ణ విగ్రహం


బీబీఎంపీ వద్ద లక్ష్మీదేవి..


నగరంలో పునీత్ రాజ్‌కుమార్



విధాన సౌధలో మహాత్మాగాంధీ విగ్రహం


ఎయిర్‌పోర్ట్‌లో ఏర్పాటైన 108 అడుగుల కెంపేగౌడ విగ్రహం

నగరంలో.. 800 విగ్రహాలు..

- చరిత్రను చాటి చెబుతున్న ప్రతిమలు
- 'ఇండియన్ ఫౌండేషన్ ఫర్ ది ఆర్ట్స్' ప్రశంసలు
- ప్రత్యేక ఆకర్షణగా 108 అడుగుల కెంపేగౌడ విగ్రహం
- విధానసౌధ ప్రాంగణమంతా స్మారకాల జోరు

బెంగళూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): చారిత్రక నగరమైన బెంగళూరులో ఎన్నో అద్భుతాలు గోచరిస్తున్నాయి. అలాంటి మహా నగరానికి మరో గౌరవం దక్కింది. నగరవ్యాప్తంగా 800 చారిత్రక విగ్రహాలు ఉన్నట్లు ఇండియన్ ఫౌండేషన్ ఫర్ ది ఆర్ట్స్ సంస్థ ప్రశంసించింది. చరిత్రను గుర్తు చేసేలా సమాజానికి దేశం కోసం ప్రాణాలు అర్పించేలా పోరాటాలు చేసిన ఎందరో ప్రముఖులను దైనందిన జీవితంలో మర్చిపోతుంటారు. విగ్రహాలను చూస్తే కొన్ని క్షణాలైనా వారిని స్మరించుకునేందుకు వీలుంటుంది. ఇలా బెంగళూరు నగరంలో ఎందరో చరిత్రకారుల విగ్రహాలు ఏ ప్రాంతానికి వెళ్లినా దర్శనమిస్తాయి. ప్రతి విగ్రహం ఏర్పాటు వెనుక ఎందరో కృషి ఉంటుంది. సామాజికవర్గం, ఉద్యమవర్గాలు ఎవరు విగ్రహం ఏర్పాటుకు కృషి చేసినా సమాజానికి మాత్రం ఒక సందేశం నిత్యం అందించినట్టే ఉంటుంది. ఎందరో మహాపురుషుల విగ్రహాలతో నగర వీధులకు కొత్త శోభను తీసుకొస్తున్నాయి. పాలకులు వారి ప్రాధాన్యతకు అనుగుణంగా విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు చొరవ చూపారు. ఇలా నగరవ్యాప్తంగా 800 విగ్రహాలు ఉన్నట్లు ఇండియన్ ఫౌండేషర్ ఫర్ ది ఆర్ట్స్ సంస్థ ప్రకటించింది. అంతకంటే ఎక్కువ ఉన్నా ఆశ్చర్యం లేదనిపిస్తుంది. 14నెలలపాటు ఫౌండేషన్ ప్రతినిధులు నగరంలో ప్రాంతాలవారీగా సందర్శించి సర్వే చేశారు. వీటిలో దాదాపు 500కుపైగా విగ్రహాలు పదేళ్లకుముందు ఏర్పాటు చేసినవిగా గుర్తించారు. నాడప్రభు కెంపేగౌడ, రాజ్‌కుమార్, అంబేడ్కర్ విగ్రహాలు అత్యధికంగా ఉన్నాయి. భారీ విగ్రహాలను ప్రభుత్వం ఏర్పాటు చేయగా చిన్నపాటి ప్రతిమలు, విగ్రహాలను పలు కూడళ్లలో ఏర్పాటు చేశారు.

విధానసౌధలో అడుగడుగునా..

విధానసౌధ ప్రాంగణాన్ని పరిశీలిస్తే ఎందరో మహనీయుల విగ్రహాలను వీక్షించవచ్చు. ఒకప్పుడు విధానసౌధ తూర్పుద్వారంలో అంబేడ్కర్ విగ్రహం మాత్రమే పెద్దది అనిపించినా ఏడేళ్ల క్రిందట విధానసౌధ, వికాససౌధల మధ్య భారీ గాంధీ విగ్రహం అద్భుతమనిపిస్తోంది. విధానసౌధ ప్రాంగణంలో తొలుత దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత వరుసగా పలు విగ్రహాల వెలిశాయి. విధానసౌధ రూపకర్త ముఖ్యమంత్రి కెంగల్ హనుమంతయ్య, సుభాష్ చంద్రబోస్, బాబు జగజ్జీవన్‌రామ్, లాల్ బహద్దూర్ శాస్త్రి, మాజీ సీఎంలు దేవరాజు అరసు, నిజలింగప్ప, కేసీ రెడ్డిల విగ్రహాలు ఉన్నాయి. తూర్పుభాగాన బసవేశ్వర, కెంపేగౌడ విగ్రహాలు ఉన్నాయి. తాజాగా వారం క్రితం కన్నడమాత భువనేశ్వరిదేవి భారీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఇలా విధానసౌధ చుట్టూ ఎన్నో విగ్రహాలు ఉన్నాయి.

నగరంలోని ప్రధాన కూడళ్లలో..

రైల్వేస్టేషన్ ముందుభాగాన స్వాతంత్ర్య సమరయోధుడు క్రాంతివీర సంగొళ్లిరాయణ్ణ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన రాయణ్ణ జయంతి, రిపబ్లిక్ డేన వర్ధంతి ఉన్నందున ప్రత్యేక కార్యక్రమాలు జరుపుతారు. రవీంద్రకళాక్షేత్ర ప్రాంగణంలో కిత్తూరు రాణి చెన్నమ్మ విగ్రహం ఉంది. బీబీఎంపీ ప్రాంగణంలో కెంపేగౌడ కోడలు లక్ష్మీదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అలాగే చాళుక్య సర్కిల్‌లో బసవణ్ణ విగ్రహం, జలమండలి ప్రాంగణంలో కావేరిమాత విగ్రహం, మల్లేశ్వరం మంత్రిమాల్ సమీపాన రాజీవ్ గాంధీ విగ్రహం, రాణి అబ్బక్క, అక్కమహాదేవి, ఇందిరాగాంధీ, స్వామి వివేకానంద, విష్ణువర్ధన్, శంకర్‌నాగ్, పార్వతమ్మరాజ్‌కుమార్‌తోపాటు తమిళ ప్రసిద్ధ కవి తిరువళ్ళువర్ విగ్రహాన్ని హలసూరులో ఏర్పాటు చేశారు. 800 విగ్రహాల్లో కేవలం 13మంది మాత్రమే మహిళాసాధకులవి ఉండగా వందకుపైగా రాజ్‌కుమార్ విగ్రహాలు, 60కుపైగా అంబేడ్కర్ విగ్రహాలు ఉన్నాయి.

ఎట్టకేలకు కన్నడ మాతకు మోక్షం!

కన్నడమాత భువనేశ్వరిదేవి విగ్రహం ఏర్పాటు చేయాలని పలుమార్లు ప్రస్తావన వచ్చినా విగ్రహం, స్థలం విషయంలో గందరగోళం ఉండేది. కన్నడ భవనం లేదా కళాగ్రామంలో నిర్మించాలనే చర్చలు జరిగాయి. మరోవైపు భువనేశ్వరిదేవి విగ్రహం విషయంలోనూ అభ్యంతరాలు ఉండేవి. అయితే ప్రభుత్వం ఐదుమంది సభ్యుల కమిటీ ఏర్పాటు చేయగా 2022లో భువనేశ్వరిదేవి రూపం ఖరారు చేశారు. ప్రభుత్వం అంగీకరించింది. ఇలా విధానసౌధ ప్రాంగణంలో భారీ విగ్రహం ఏర్పాటు చేశారు.



బెంగళూరు నగర నిర్మాతకు దక్కిన గౌరవం

పన్నెండో శతాబ్దంలో సమాజంలో చైతన్యం తీసుకురావడం, అందరూ సమానమనేలా చాటిన క్రాంతికారుడు బసవణ్ణ, బెంగళూరు నగర నిర్మాత కెంపేగౌడ విగ్రహాలు పలుచోట్ల వెలిశాయి. దక్షిణభారత నగరాలలో విగ్రహాలు ప్రధాన కూడళ్లలో కనిపిస్తాయి. కన్నడ సినిమా రంగం ద్వారానే భాషాభిమానం, ప్రాంతీయతత్వంకోసం పాటుపడిన కోట్లాదిమంది అభిమాన నటుడు కన్నడ కంఠీరవుడు రాజ్‌కుమార్ విగ్రహాలు ప్రతి కూడలిలోనూ కనిపిస్తాయి. ఇటీవలే గుండెపోటుతో అర్ధాంతరంగా కన్నుమూసిన నటుడు, యువతకు స్ఫూర్తి, కన్నడిగులు అభిమానించే పునీత్‌రాజ్‌కుమార్ విగ్రహాలు కొన్నినెలలుగా గణనీయంగా పెరిగాయి. సర్కిళ్లు, ఎంపిక చేసిన ప్రదేశాలే కాకుండా ప్రతి ప్రాంతానికో విశిష్టత తీసుకొచ్చేలాంటి చర్యలు నగరంలో కొనసాగాయి. చామరాజపేటకు అనుబంధంగా జింకె పార్కులో జ్ఞానపీఠ పురస్కార గ్రహీతల విగ్రహాలు వరుసగా ఏర్పాటు చేశారు. వారి రచన, జ్ఞానపీఠ పురస్కారం పొందిన సంవత్సరాన్ని పొందుపరిచారు. ఇది విద్యార్థులకు అవగాహన కల్పించేలా ఉంది. పర్యాటకులకు ఇది ప్రత్యేక ఆకర్షణ.

విమానాశ్రయంలో 108 అడుగుల భారీ విగ్రహం


దేవనహళ్ళిలోని అంతర్జాతీయ విమానాశ్రయం ప్రాంగణంలో 108 అడుగుల ఎత్తుతో నాడప్రభు కెంపేగౌడ కాంస్యవిగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 2022లో ఆవిష్కరించిన విగ్రహానికి 'ప్రగతి ప్రతిమ'గా పేరు పెట్టారు. బెంగళూరులో ఇదే అత్యంత ఎత్తైన విగ్రహంగా ఉంది. రూ.64 కోట్ల ఖర్చుతో 218 టన్నుల బరువుతో నిర్మించారు. విగ్రహానికి 4 టన్నుల బరువైన ఖడ్గాన్ని రూపొందించారు. 90 అడుగుల కాంస్య విగ్రహం, 18 అడుగుల పీఠిక ఉంది. 120 టన్నుల ఉక్కు, 98 టన్నుల కాంస్యం ఉపయోగించారు. విగ్రహం చుట్టూ 23 ఎకరాల ప్రదేశంల కెంపేగౌడ థీమ్‌పార్క్‌కు అవకాశం కల్పించారు. విగ్రహాన్ని రామ్ వి సుతారా ఏర్పాటు చేశారు.

అధైర్యం వద్దు.. అండగా ఉంటాం..

- ఒక్కరి కోసం అందరూ బలి కావద్దు..
- పరోక్షంగా జేడీఎస్ ఎమ్మెల్యేలకు డీకే ఆఫర్
- ఆపరేషన్ హస్త దిశగా అడుగులు

బెంగళూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ హస్త కొనసాగుతుందని కొన్ని నెలల కాలంగా ప్రచారం సాగుతోంది. తాజాగా ఆదివారం డీసీఎం డీకే శివకుమార్ చేసిన వ్యాఖ్యలు సంచలనమాయ్యాయి. చన్నపట్టణలో ఆదివారం అభినందన సమావేశం జరిపారు. ఈ సందర్భంగా డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ పాపం జేడీఎస్ కార్యకర్తలకు చెప్పాలని అపిస్తోంది. టైం వృథా చేసుకోవద్దని, ఈ ప్రాంతం బెంగళూరు దక్షిణ జిల్లా కానుందని, ఒక వ్యక్తి కోసం పార్టీనే బలి చేశారన్నారు. చేతులు జోడించి కోరుకుంటున్నా అని, తనతో పాటు సీఎం సిద్దరామయ్య మీకు ఉండగా ఉంటామని పరోక్షంగా కాంగ్రెస్‌లో చేరాలని ఆఫర్ ఇచ్చారు. చన్నపట్టణ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన కుమారస్వామి ముఖ్యమంత్రి అయ్యారని, కేంద్రమంత్రి అయ్యారని నియోజకవర్గంలో ఒక పాఠశాల కట్టారు, ఒక గుడి కట్టారా..? ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. తనతోపాటు తమ్ముడు డీకే సురేశ్‌ను నీచంగా మాట్లాడారని అందుకు ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో చన్నపట్టణ ప్రజలు సీపీ యోగేశ్వర్‌ను గెలిపించి గుణపాఠం చెప్పారన్నారు. ఇదే సమావేశంలో మాగడి ఎమ్మెల్యే బాలకృష్ణ మాట్లాడుతూ కాబోయే ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అంటూ వ్యాఖ్యానించారు. కాగా చన్నపట్టణకు అనుబంధంగా కణ్వ డ్యాంను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసే విషయమై స్థానిక ఎమ్మెల్యేలతో డీసీఎం సమీక్ష జరిపారు. అనంతరం కణ్వ డ్యాంలో బోటు షికారు చేశారు. జల విహార, జలక్రీడా పార్కు ఏర్పాటుపై చర్చించారు. ఎమ్మెల్యేలు సీపీ యోగేశ్వర్, బాలకృష్ణ, రంగనాథ్, శ్రీనివాస్, మాజీ ఎంపీ డీకే సురేశ్, ఎమ్మెల్సీ రవి ఉన్నారు.


కణ్వ డ్యాంలో బోటు షికారులో డీసీఎం డీకే శివకుమార్


చకచకా సాగుతున్న కేబుల్ వంతెన పనులు

శరావతి.. పురోగతి..!

- బ్యాక్ వాటర్‌పై చకచకా పనులు..
- సిగందూరు వంతెన పనులు దాదాపు పూర్తి
- చౌడేశ్వరీ మాతను చేరుకోవడం ఇక వేగవంతం
- 4 నెలల్లో పర్యాటకులకు అందుబాటులోకి..

బళ్లారి గాంధీనగర్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శివమొగ్గ జిల్లా పరిధిలోని సిగందూరులో వెలసిన చౌడేశ్వరి దేవిని దర్శించుకోవడానికి శరావతి బ్యాక్ వాటర్‌లో వెళ్లాలంటే సాహసోపేతమైన ప్రయాణంగా చెప్పవచ్చు. శరావతిలో నీటి ప్రమాణం ఎక్కువైన ప్రతిసారీ భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. రోజుల తరబడి రాకపోకలు ఆగిపోయేవి. అయితే ఇకపై భక్తుల కష్టాలు తీరనున్నాయి. భక్తుల సౌకర్యార్థం అప్పటి ముఖ్యమంత్రి యడియూరప్ప ఆలయాల మధ్య అనుసందానాన్ని సులభతరం చేస్తూ శరావతి బ్యాక్ వాటర్ ప్రాంత ప్రజలకు ఉపకరించే సింగదూరు వంతెన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. యడియూరప్ప సంకల్పం ఫలితంగా 2019 సంవత్సరంలో భారీ వంతెన పనులు ప్రారంభించారు. ఈ వంతెన నిర్మాణానికి సుమారు 464.23 కోట్ల రూపాయలను కేంద్ర రవాణా శాఖామంత్రి నితిన్ గడ్కరీ మంజూరు చేశారు. ఈ వంతెన సుమారు 2.14కిలోమీటర్ల పొడవు, 16మీటర్ల వెడెల్పు ఉంది. రూ 423.15కోట్ల వ్యయంతో వంతెన నిర్మాణం పనులు 2020 డిసెంబరు నెలలో ప్రారంభమయ్యాయి. కరోనా, అధిక ప్రమాణంలో బ్యాక్ వాటర్ రావడంతో రెండు సంవత్సరాల పాటు పనులు మందగతిన సాగినా, అనంతరం పనులు అనంతరం వేగవంతం అయ్యాయి. ప్రస్తుతం అలవాద హిన్నీరులో 17 పిల్లర్ నిర్మించగా, పిల్లర్ల మధ్య ప్రికాస్ట్ కాంక్రీట్ బ్లాక్‌లను జోడించే పనులు వేగంగా సాగుతోంది. ఈ వంతెన బ్యాక్‌వాటర్ భాగంలో ప్రజలు ఉపయోగానికి రానుందని వంతెన ఇన్‌చార్జ్ అధికారి ఫీర్‌పాషా అభిప్రాయ పడుతున్నారు.


సిగందూరులో వెలసిన చౌడేశ్వరీ దేవి

వంతెన ప్రాముఖ్యత

సిగందూరు కేబల్ ఆధారిత వంతెన నిర్మాణం మరోనాలుగు నెలల్లో ప్రజల రాకపోకలకు సిద్ధం కానుంది. సిగందూరు వంతెన నిర్మాణానికి భారత కేబుల్ ఆధారిత వంతెనలలో 7వ అతిపెద్ద వంతెనగా పేరొందింది. ప్రస్తుతం వంతెన నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. కేవలం గర్డర్ బాక్సులను ఏర్పాటు చేయడం మాత్రమే మిగిలి ఉంది రెండు మూడు నెలల్లో ఈ పనులు కూడా పూర్తి కానున్నాయి. శరావతి బ్యాక్ వాటర్‌లో నిర్మాణం అవుతున్న వంతెన చూడడానికి నిర్మాణం అద్భుతంగా తెలియజేస్తోంది. సిగందూరు పర్యాటక పర్యాటక ప్రాంతానికి ఈ వంతెన అద్భుత నిర్మాణంగా నిలవనుంది సిగందూరు చౌడేశ్వరి దేవస్థానం దర్మదర్శి రామప్ప హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అమ్మవారి దర్శనానికి పడవపై వాహనాలతో వెళ్తున్న భక్తులు (ఫైల్)


గ్రాంట్లు లేక కుంటుపడుతున్న అభివృద్ధి

- రాజీనామా అనంతరం మీడియాతో బీఆర్ పాటిల్




బెంగళూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సలహాదారుడి పదవికి రాజీనామా చేసిన అళంద ఎమ్మెల్యే బీఆర్ పాటిల్ ఆదివారం కలబురగిలో మీడియాతో మాట్లాడారు. గ్రాంట్లు విడుదల చేయడం లేదని, నియోజకవర్గంలో అభివృద్ధి చేయలేకపోతున్నామని, సామాన్యులు అడిగే సమస్యలను తీర్చలేకపోతున్నామని విచారం వ్యక్తం చేశారు. ఎప్పుడో రాజీనామా చేయాలని భావించానని కానీ ఇటీవల వివాదాలతో గవర్నర్ చేతిలో అస్త్రంగా ఉన్న సమయంలో ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టరాదని వెనుకడుగు వేశానన్నారు. అసంతృప్తి లేదని, కానీ సమస్యలు ఉన్నాయని, వాటన్నింటినీ బహిరంగ పరచలేనన్నారు. రాజీనామా విషయమై సీఎం సిద్దరామయ్యతోనూ చర్చలు జరుపుతానని అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీనామా ఉపసంహరించుకునేది లేదని తేల్చి చెప్పారు. ఎమ్మెల్యేగా అభివృద్ధి పనులు చేయలేకపోతున్నా అన్నారు. గతంలోనూ బీఆర్ పాటిల్ సొంత పార్టీ ప్రభుత్వంపైనే తీవ్రస్థాయిలో మండిపడిన విషయం తెలిసిందే. ఆయనను బుజ్జగించేందుకే ముఖ్యమంత్రి సలహాదారుడి హోదా కల్పించారు. బీఆర్ పాటిల్, సీఎం సిద్దరామయ్యకు పాత స్నేహితుడు. ఆయన ఆప్తులలో ఒకరిగాను పేరొందారు. మంత్రి పదవిని ఆశించారు. అయితే సాధ్యం కాకపోవడంతో అసంతృప్తిగా ఉన్నారు.

25వేల ఎకరాలకు సాగునీరు

- మంత్రి ఎంబీ పాటిల్

బెంగళూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జలవనరులశాఖ మంత్రి అయ్యాక చేపట్టిన పథకాల ద్వారా వేసవిలోనూ తోటలకు నీరు అందేలా చేపట్టినట్టు సీఎం సిద్ధరామయ్య ప్రభుత్వంలో ఇవన్నీ సాధ్యమని మంత్రి ఎంబీ పాటిల్ వెల్లడించారు. విజయపుర జిల్లా బబలేశ్వర తాలూకాలోని నిడోణి, శేగుణసి తదితర గ్రామాలలో ముళవాడ ఎత్తిపోతల పథకం ద్వారా 5ఏ, 5బి లిఫ్ట్ ఇరిగేషన్, 15వ డిస్ట్రిబ్యూషన్ కాలు పనులు త్వరలోనే చేపడతామని భారీ పరిశ్రమలు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఎంబీ పాటిల్ తెలిపారు. బెంగళూరు ప్రెస్‌క్లబ్ నుంచి వార్షిక పురస్కారం అందుకున్న నేపథ్యంలో బబలేశ్వర తాలూకా సంగాపుర హెచ్ గ్రామంలో ఏర్పాటైన అభినందన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న పనులను చేపట్టడం ద్వారా సుమారు 25వేల ఎకరాల ప్రదేశానికి సాగునీరు సాధ్యమన్నారు. జలవనరులశాఖ మంత్రి అయ్యాక సాగునీటి ప్రాజెక్టులకోసం 58వేల కోట్లు ఖర్చు చేశామన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1617.06	1,588.39
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10.137	442
నీటి నిల్వ (టీఎంసీలు)	53.47	9.74

మహాకుంభ మేళాకు ప్రత్యేక బస్సులు

బళ్లారి గాంధీనగర్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఉత్తర ప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభ మేళా వెళ్ళే వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్న దృష్ట్యా ప్రయాణికులు వెళ్ళడానికి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కళ్యాణ కర్ణాటక రోడ్డు రవాణా సంస్థ బళ్ళారి డివిజన్ నుంచి ప్రయాగ్‌రాజ్‌కు ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. కుంభమేళాకు వెళ్ళేవారి సంఖ్య లక్షల్లో ఉండడంతో రైలు, విమనాలు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో భక్తుల సౌకర్యార్థం బళ్ళారి నుండి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు ఇనాయత్ భాగబాన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలోని బళ్ళారి, మోకా, కురుగోడు, కంప్లి, ఎమ్మిగనూరు, సిరుగుప్ప, తెక్కలకోట, హాళే కోట, తోరణగల్లు, సండూరు, చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడపపున్నట్లు అధికారులు తెలిపారు. భక్తులు ఈ ప్రత్యేక బస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్న వివరాల కోసం బళ్లారి-1 యూనిట్‌మేనేజర్ 7760992162, బళ్లారి -2 మేనేజర్ 7760992164, సిరుగుప్ప మేనేజర్ 7760992165, కురుగోడు మేనేజర్ 9606483671, సండూరు మేనేజర్ 7760992309 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు పొందచ్చని అధికారులు తెలిపారు.

సెల్‌ఫోన్ల స్వాధీనం



సెల్ ఫోన్లను చూపుతున్న పోలీసులు

కంప్లి, ఫిబ్రవరి 2(ఆంధ్ర జ్యోతి): హగరి బొమ్మనహళ్లి పోలీసు స్టేషన్ పరిధిలో పోలీసు శాఖ 25 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెంకటస్వామి తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మొబైల్ పోగొట్టుకున్న బాధితుల ఫిర్యాదు మేరకు దొంగలను పట్టుకుని సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకు న్నామన్నారు. వీటి విలువ రూ.5 లక్షల వరకు ఉంటుందన్నారు. ఎస్ఐ గీతాంజలి షిండే, సిబ్బంది బసవరాజు, వీరేష్, శశిధర్, దొంగలను పట్టుకునే విషయంలో ఎంతో చాకచక్యంగా వ్యవహరించినట్లు తెలిపారు. బాధితులు స్టేషన్లో సంప్రదించాలని సూచించారు.

కొండెక్కిన ఉల్లి ధరలు

హోసూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): హోసూరు పరిసర ప్రాంతాల్లో రైతులు విస్తారంగా పండే చిన్న ఉల్లి సహా సరిహద్దులోని అత్తిబెలె, ఆనేకల్ చుట్టు పరిసర ప్రాంతాల నుంచి కూడా హోసూరు మార్కెట్‌కు తరలి వస్తోంది. దీంతో కిలో రూ.70-80 ధర పలుకుతోంది. ఇదివరకు రైతుబజారులో కిలో రూ.100-110 మధ్య ఉండేది. రాబోవు రోజుల్లో ఇంకా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని రైతుబజార్ వర్గాలు తెలిపాయి.



హోసూరు మార్కెట్లో చిన్న ఉల్లిపాయలు

కేంద్ర బడ్జెట్‌లో 50 పర్యాటక ప్రాంతాలకు పెద్దపీట

● ఆ జాబితాలో హంపి ఉండేనా? ● అధికారుల ఎదురుచూపు

బళ్లారి గాంధీనగర్/సిటీ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కేంద్రం ఈ సారిప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో విజయనగర జిల్లా అభివృద్ధికి సహకారం లేనప్పటికీ దేశంలో ఉన్న 50ప్రధాన పర్యాటక ప్రాంతాల్లో ఉపాధి ఆధారిత అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టాలన్న ప్రతిపాదన ముందుకు వచ్చింది. ఇందులో హంపి కూడా ఉంటుందా అన్నది ఈ ప్రాంత ప్రజల్లో ఆసక్తిగా మారింది. రాష్ట్రంలో ప్రధాన పర్యాటక ప్రాంతాల్లో హంపి ముందంజలో ఉంది. దీనికి గొప్ప స్థానం ఉందనే విషయం అందరికి తెలిసిన విషయమే.. ప్రస్తుతానికి బడ్జెట్‌లో ప్రకటించిన 50 పర్యాటక ప్రాంతాలు ఏవి అనేవి బడ్జెట్‌లో ఇంకా ప్రకటించలేదు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో హంపిని చేర్చితే పలు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నది స్థానికుల అభిప్రాయ పడుతున్నారు. హంపి ఉట్టుప్రక్కల ప్రాంతాల్లో అధికారికంగా హోంస్టేలు లేవు...హంపి అభివృద్ధిలో భాగంగా హంపి చుట్టుప్రక్కల పరిసరాల్లో హోంస్టేలు ప్రారంభిస్తే ముద్రా రుణాల లాంటి పథకాలతో ఈ ప్రాంతంలో హోంస్టేలను పరిశ్రామిక అభివృద్ధిగా పరిగణించి భూముల ఖరీదు, కట్టడాల నిర్మాణం, ఇతరత్ర సౌకర్యాలు కల్పించేందుకు పథకాలు అమలు అయితే అందులో హంపి ఉన్నట్లు అయితే పెద్ద ప్రమాణంలో ఉపాధి అవకాశాలు అభిస్తాయని స్థానిక పర్యాటక శాఖ అధికారులు అభిప్రాయ పడుతున్నారు.



హంపి రాతిరథం

హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ సంస్థలను స్థాపించడం, యువత నైపుణ్యాలను పెంపొందించడం, పర్యాటక ప్రాంతాలకు ట్రాఫిక్ కనెక్టివిటీని పెంచడానికి సులభమైన ఏర్పాట్లల చేయడం, సౌకర్యాలు, పరిశుభ్రత, మార్కెటింగ్ ప్రయత్నాలు, ఈవీసా సౌకర్యాలు పరంగా రాష్ట్రాలకు ప్రోత్సాహాలు అందించడం వంటి ప్రాజెక్టులు బడ్జెట్‌లో ఉన్నాయి. కొన్ని పర్యాటక సమూహాలకు వీసా రహిత సౌకర్యాలు, వీటన్నింటిని హంపికి వర్తింపజేస్తే ఈ భాగంలోచాల పెద్దమార్పు వచ్చే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. బడ్జెట్‌లో ప్రతిపాదించిన మరో ముఖ్యమైన అంశాల్లో పర్యాటక ప్రాంతాలకు సమీపంలో పెద్ద హోటల్‌తో సహా మౌలిక సౌకర్యాలు కల్పించడానికి స్థానిక ప్రభుత్వాలు భూములు ఇస్తే కేంద్రం హోటళ్ళను నిర్మిస్తుంది. ఇది హంపికి కూడా వర్తింప చేస్తే హంపి రూపురేఖలే మారిపోతాయని పలువురు పర్యాటక శాఖ అధికారులు అభిప్రాయ పడుతున్నారు. హంపిలో అనేక హోంస్టేలు ఉన్నప్పటికీ అవి పర్యాటక శాఖ రికార్డుల్లో లేవు. శాఖ సమాచారం ప్రకారం హంపి చుట్టుప్రక్కల అధికారి హోంస్టే లేదు. హొసపేటలో మాత్రమే ఒక అధికారిక హోం స్టే ఉందని పర్యాటక శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

రహదారి భద్రతపై శ్రద్ధ వహించాలి: కలెక్టర్

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రవాణా, ప్రజాపనులు, గనులు, భూసేకరణ శాఖల అధికారులు రోడ్డు భద్రతపై శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా సూచించారు. ఆదివారం నగరంలోని కలెక్టర్ కార్యాలయ హాల్లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి రోడ్డు భద్రతా కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రజల రాకపోకలకు వీలుగా రోడ్డు మరమ్మతులు చేసి ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. జాగ్రత్త వహిస్తే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చన్నారు. సండూరు ప్రాంతంలో ఖనిజ లారీలు తరచూ ప్రమాదానికి కారణమవుతున్నాయని, ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ రవాణా శాఖ అధికారులకు సూచించారు. ప్రమాదాల సంఖ్య తగ్గించేందుకు సున్నిత మండలం 20గ్రామపంచాయితీ పరిధిలో వివిధ శాఖల సహకారంతో ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు, భారీ వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాలన్నారు. అలాంటి వాహనాలు కనిపిస్తే తనిఖీలు నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని ప్రాంతీయ రవాణాశాఖ అధికారులను ఆదేశించారు. ఎక్కడ బడితే అక్కడ ఆపకుండా ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

జిల్లాలో వివిధ గ్రామాలకు వెళ్లేందుకు బస్సుల కొరత ఉంది. దీనిపై మీడియాలో కథనాలు రావడంతోపాటు ప్రజాప్రతినిధులు కూడా ఈ విషయాన్ని ప్రస్తావించారు. మరణం, గాయం విషయంలో ఎవరు బాధ్యత వహిస్తారు?. కేకేఆర్‌టీసీ బళ్లారి డివిజన్ కూడా ఆదాయం వస్తోంది, కొత్తబస్సుల కొనుగోలు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు పోలీసు సూపరింటెండెంట్ రవికుమార్, పబ్లిక్ వర్క్ డిపార్ట్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హేమంతరాజ్, ప్రాంతీయ రవాణా అధికారులు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, నేషనల్ హైవే అథారిటీ అధికారులు పాల్గొన్నారు.

వరద బాధితులకు తీరని గూడు సమస్య

● అరకొర సౌకర్యాలతో కాలనీలు



ముళ్లకంపల నడుమ నిరాశ్రిత కాలనీ..

గంగావతి రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కొప్పళ తాలూకా పరిధిలోని అళవండి గ్రామంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలు ఎందుకూ పనికి రాకుండా పోయాయి. 2009-10 సంవత్సరంలో ఈ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాల కారణంగా వందలాది మంది ఇళ్ళు కోల్పోయారు. ఆ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం వారిని పునరావాస కేంద్రాలకు తరలించింది. ప్రస్తుతం పునరావాసా ప్రాంతాల్లో ముళ్ళకంపలు పెరగడంతో నివాస యోగ్యం కాకుండా మారాయి. కనీస వసతులైన తాగునీరు, విద్యుత్ వ్యవస్థలేక పోవడంతో పునరావాస కేంద్రాలకు వెళ్ళాలంటే బాధితులు ఆందోళన చెందుతున్నారరు. కొప్పళ తాలూకా హిరేసింధోగి గ్రామంలో హిరేహళ్ళి బ్యాక్ వాటర్ కారణంగా ముంపునకు గురైన ప్రాంతం నుంచి ప్రస్తుతం ఉన్న పునరావాస ప్రాంతానికి తరలించి అక్కడే 328 కుటుంబాలకు హలగేరి రోడ్డు ప్రక్కన వసతి కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుం వీటిలో 200మంది నివాసం పొందుతున్నారు. ఈ ప్రాంతానికి సరైన మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో నిరాశ్రిత ప్రజలు ఆ ఇళ్ళలో ఇండాలంటేనే వెనకంజ వేస్తున్నారు. ఇళ్ళచుట్టు ముళ్ళకంపలు ఏపుగా పెరగడంతో పాటు మురికి కాలువలు నిండి దుర్వాసన వెదజల్లుతున్నాయి. దీంతో రాత్రి అయితే చాలు దోమల బెడద కారణంగా అనారోగ్య పాలవుతున్నారు. తాగునీటి వేర్పాటు చేసిన పైప్‌లైన్ నుండి చుక్కనీరు రావడం తాగునీటికోసం వందలమీటర్ల వెళ్ళి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అధికారులు, ప్రజా ప్రతినిధులు పునరావాస కేంద్రంలో నెలకొన్నసమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం

కంప్లి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): విజయనగర జిల్లా హోస్పేట సమీపంలోని రాజాపుర గ్రామంలో వుండే కరియమ్మ దేవస్థానం పునర్నిర్మాణం కోసం ధర్మస్థల గ్రామీణాభివృద్ధి యోజన పథకం కింద రూ.లక్ష విరాళం అందజేసింది. సంస్థ డైరెక్టర్ సతీష్ శెట్టి దేవస్థాన కమిటీకి డీడీ అందించారు. వారితో పాటు తాలుకా యోజన అధికారి మారుతి, ఆలయ కమిటీ అధ్యక్షులు నాగేంద్రప్ప, ఉపాధ్యక్షులు బర్మప్ప, రాజాపుర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న దాతలు

బస్సు బోల్తా.. ప్రయాణికులు సురక్షితం

బళ్లారి సిటీ/రూరల్, పిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని హలకుంది బైపాస్ సమీపంలో ఆదివారం ఉదయం ఆర్టీసీ బస్సు అదుపు తప్పి బోల్తాపడింది. బెంగూళురు నుంచి సిరుగుప్ప వెళ్తున్న కళ్యాణ కర్ణాటక ట్రాన్స్‌పోర్టు బస్సు రోడ్డు పక్కన కంపచెట్లలోకి బోల్తా పడింది. బస్సులో ముప్పై మందికిపైగా ప్రయాణికులున్నారు. వీరిలో ముగ్గురికి మాత్రమే స్వల్ప గాయాలు కాగా, మిగిలిన వారికి పెద్దగా గాయాలు కాలేదు. బస్సు తక్కువ స్పీడుతో ప్రయాణిస్తుండడంతో ఓ వైపు వాలి నిలబడిపోయింది. హలకుంది గ్రామప్రజలు తక్షణమే స్పందించి కిటికీ అద్దాలు పగలగొట్టి బస్సులో ఉన్న వారిని బయటికి తీసి రక్షించారు. బళ్లారి ట్రాఫిక్, రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి సహాయక చర్యలు చేపట్టారు.





◄ బోల్తా పడిన బస్సు, సహాయక చర్యల్లో స్థానికులు ►



విద్యార్థులతో ఏఐడీఎస్ఓ నాయకులు, పదాధికారులు

విద్యార్థులకు బహుమతుల పంపిణీ

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మహావిప్లవకారుడు నేతాజీ సుభాస్ చంద్రబోస్ 128వ జయంతి సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఆదివారం ఏఐడీఎస్ఓ కార్యాలయంలో బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఏఐడీఎస్ఓ జిల్లా అధ్యక్షుడు ఈరన్న మాట్లాడుతూ జనవరి 23న గొప్ప విప్లవకారుడు నేతాజీ సుభాస్ చంద్రబోస్ స్వాతంత్ర్య పోరాటం ఇప్పటికీ మరువలేనిదన్నారు. నేతాజీ ఆశయాలు విద్యార్థులకు ఆదర్శంగా వ్యక్తిగత జీవితంలో ఎదురయ్యే సమస్యలన్నింటినీ ఎదుర్కొంటారు. ఈ సాంస్కృతికపోటీల్లో పాల్గొన్న విద్యార్థులు నేతాజీకి సముచిత గౌరవం ఇచ్చారన్నారు. ఏఐడీఎస్ఓ జిల్లా కార్యదర్శి కంబలి మంజునాథ్ మాట్లాడుతూ విద్య-సంస్కృతి-సమానత్వాన్ని కాపాడేందుకు ఏఐడీఎస్ఓ పోటీలు నిర్వహించామన్నారు. అనంతరం పలు పోటీల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికేట్లు అందజేశారు.కార్యక్రమానికి ఏఐడీఎస్ఓ జిల్లాఉపాధ్యాక్షురాలు ఎం. శాంతి, ఉమ, సభ్యులు సమీర్, శ్రీధర్,శివనగౌడ, విద్యార్థులు పాల్గొన్నారు.

విజ్ఞానయాత్రతో కొత్త అనుభూతి



నగరంలోని డీసీ కార్యాలయం వద్ద విద్యార్థులు

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): విజ్ఞానయాత్రల ద్వారా పిల్లలు కొత్త అనుభూతిని, అలోచనలను పెంచుకుం టారని కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం బళ్లారి యూనిట్ అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి అన్నారు. ఆదివారం తాలూకాలోని సంజీవరాయనకోట ప్రభుత్వపాఠశాల విద్యార్థులతోకలిసి ఒకరోజు క్షేత్ర పర్యటనకు వెళ్ళి నగరంలోని హెచ్‌ఆర్, గవియప్ప సర్కిల్లోని జగజ్యోతి బసవన్న విగ్రహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో విద్యార్థులు తప్పక చూడవలసిన చారిత్రక ఆధునిక ప్రదేశాలు చాలా ఉన్నాయన్నారు.

పీఠాధిపతి ఆశీస్సులు పొందిన ఎమ్మెల్యే



శంకరభారతి స్వాముల ఆశీర్వాదం పొందుతున్న ఎమ్మెల్యే నాగరాజు

సిరుగుప్ప, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): అనెగొంది సంస్థాన పీఠాధిపతి శంకర భారతి స్వాములను ఎమ్మెల్యే బీఎం నాగరాజు ఆదివారం దర్శించుకుని ఆశీర్వాదాన్ని పొందారు. తాలుకాలోని టెక్కలకోట పట్టణంలో గురుదత్తాత్రేయ ఆశ్రమాన్ని సందర్శించిన స్వాముల వారిని ఆశ్రమ కమిటీ సభ్యులు సాదరంగా స్వాగతం పలికారు. ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తాలుకా అధ్యక్షుడు కరిబసప్ప, ప్రముఖనాయకులు పవన్‌కుమార్ దేశాయ్, రమేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

పచ్చదనం అందరి బాధ్యత కావాలి



మొక్కలు నాటుతున్న అధికారులు

హోసూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పచ్చదనం అందరి బాధ్యత కావాలని జిల్లా అటవీ శాఖ అధికారి జగదీశ్ అభిప్రాయపడ్డారు. హోసూరు అదియమాన్ కళాశాల ఇంజనీరింగ్ కంట్రి వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో అటవీశాఖ సహకారంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాధాకృష్ణన్, డాక్టర్ అజితతో కలిసి నత్తన్ బిజినెస్ అధికారి ఏడీ అరవింద్, డాక్టర్ ఆర్.ధనశేఖర్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు 150 మొక్కలు నాటారు. కార్యక్రమంల్లో పారిశ్రామికవేత్త అరవింద్ ఏడీ, ధనశేఖర్ పాల్గొన్నారు.

సమ్మెను విరమించిన లారీ యజమానులు

● క్రషర్స్ అసోసియేషన్‌తో చర్చలు సఫలం

హోసూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): హోసూరులో క్రషర్ యజమానుల చర్చలు ఫలించడంతో నిరవధిక సమ్మెను లారీ యజమానులు విరమిస్తున్నట్లు సౌత్ ఇండియన్ క్రష్ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షణ్ముగప్ప ప్రకటించారు. జనవరి 1 నుంచి కృష్ణగిరి, హోసూరు, కర్ణాటకలోని ఆనేకల్‌లో క్రషర్ల యజమానులు రూ.100 నుంచి రూ.200 వరకు ధరలు పెరగడంతో దీంతో లారీ యజమానులకు ఇబ్బంది కలగకూడదని ఇరువర్గాల మధ్య జరిగిన ఒప్పందాన్ని క్రషర్ల యజమానులు ఉల్లంఘించారని లారీ యజమానులు ఆరోపించారు. ఈ విషయమై లారీ యజమానుల తీరును ఖండిస్తూ జనవరి 27 వ తేది నుంచి సమ్మెకు దిగారు. దీంతో నిర్మాణ పనులకు అంతరాయం నెలకొంది. క్రషర్ల యజమానులు, లారీల యజమానుల మధ్య జరిగిన చర్చలు ఫలించాయి. దీంతో పాత రేటుకు ఇచ్చేలా ఇరువర్గాల మధ్య ఒప్పందం కుదిరింది. ఆదివారం హోసూరు సరిహద్దు అత్తిబెలెలో కృష్ణగిరి జిల్లా క్రషర్ల ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంపంగి అధ్యక్షతలో సమావేశం జరిగింది. సమావేశానికి సౌత్ ఇండియా లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షణ్ముగప్ప మీడియాతో మాట్లాడుతూ.. టన్నుపై రూ.80 అందిస్తున్నారని, అలాగే తమిళనాడు నుంచి కర్ణాటక రాష్ట్రానికి ఖనిజాల రవాణాకు కోర్టు అనుమతించింది అని లారీ యజమానులకు ప్రభుత్వ అధికారులు సహకరించాలని, వేలాది మంది కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారన్నారు.



మాట్లాడుతున్న క్రషర్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు

కాలుష్య నియంత్రణకు చర్యలు ఏవీ...?



డివైడర్ మధ్యలో పిచ్చిమొక్కలు

హోసూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలో పారిశ్రామికీకరణతో కాలుష్యం అధికమవుతోందని నియంత్రణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఇదివరకు రోడ్డుపక్కన భారీగా మొక్కలు, చెట్లు ఉండేవని అభివృద్ధి పేరిట అవి తగ్గుముఖం పడుతున్నాయని వాపోతున్నారు. కొన్నిచోట్ల ప్రధాన రహదారుల డివైడర్‌ల మధ్య మొక్కల కంటే పిచ్చి గడ్డి ఉంటోందని అయితే పెరిగిన కాలుష్యాన్ని నియంత్రించేందుకు విస్తారంగా మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత చేపట్టాలని కోరుతున్నారు. వాహనాలు, కర్మాగారాల నుంచి వెలువడే పొగవల్ల పర్యావరణం దెబ్బతింటోందని, పచ్చదనం పెంచేందుకు ప్రాధాన్యత ఇచ్చి గ్రీన్ సిటీగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా రామనాయకన్ సరస్సు, డెంకణీకోట రోడ్డు, బస్ స్టేషన్‌కు వెళ్లే రెండు మార్గాలలో మీటర్ల మేర డివైడర్ గోడను నిర్మించారు. ఈ రిటైనింగ్ గోడల మధ్య ఖాళీస్థలాన్ని చెట్లకు ఉద్దేశించినా పిచ్చిగడ్డి, అనవసర మొక్కలు మొలకెత్తాయి. వీటికోసం పశువులు రోడ్లపై తిరుగుతూ వాహనదారులకు ఇబ్బందిగా మారుతోంది. ఇకనైనా హోసూరు కార్పొరేషన్ ఈ దిశగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

లక్ష్య సాధనతోనే విజయం

● విద్యార్థులకు డాక్టర్ కవితా మిశ్రా సూచన
● ఘనంగా సత్యం, సర్ ఎంవీ కళాశాలల వార్షికోత్సవం



ముఖ్య అతిథి డాక్టర్ కవితా మిశ్రాను సన్మానిస్తున్న కళాశాల బృందం

బళ్లారి గాంధీనగర్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పీయూ విద్యార్థులు మొదటి సంవత్సరం నుంచే లక్ష్య సాధనతో చదివితే ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని డాక్టర్ కవితా మిశ్రా సూచించారు. శనివారం నగరంలోని సత్యం పీయూ కళాశాల, సర్.ఎం.వి కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రెండవ సంవత్సరం వార్షికోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు నాలుగు గోడల మధ్య చదువుకు మాత్రమే పరిమితం కాకుండా తరచూ వ్యాయామం, క్రీడలు ఆడడం ద్వారా మానసిక ఉల్లాంతో పాటు దేహదారుఢ్యాన్ని పెంచుకోవచ్చన్నారు. కొద్దిపాటి విరామం దొరికితే చాలు స్మార్ట్‌ఫోన్‌లో మునిగి పోయి కాలం వృథా చేస్తున్నారని, అలా కాకుండా స్మార్ట్ ఫోన్‌లు తమ విజ్ఞానాభివృద్ధికి ఉపయోగించు కోవాలన్నారు. విద్యార్థి దశలో పీయూ రెండు సంవత్సరాల విద్యాభ్యాసం చాలా క్రియాశీలమైన సమయమని, ఈ రెండు సంవత్సరాలు కష్టపడి చదివి అటు కళాశాలకు, కన్న తల్లి తండ్రులు ఉత్తమ పేరు తీసుకొచ్చే దిశలో కృషి చేయాలన్నారు. అనంతరం సత్యం పీయూ కళాశాల కార్యదర్శి జగదీష్, సర్‌ఎంవీ కళాశాలకు చెందిన సురేష్ కుమార్, ట్రస్టి పద్మనాభన్, అమిత్‌లతో పాటు కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందజేశారు.



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

నోర్మన్ రాక్‌వెల్ (జయంతి)



నోర్మన్ రాక్‌వెల్ 1894 ఫిబ్రవరి 3న జన్మించారు. అమెరికాకు చెందిన చిత్రకారుడు, ఇల్లస్ట్రేటర్. అమెరికా సంస్కృతికి ప్రతీకగా 4వేలకుపైగా కళాఖండాలు గీశారు. 40కుపైగా పుస్తకాలకు బొమ్మలు రూపొందించారు. కెన్నెడీ, జాన్సన్, నిక్సన్, జవహర్‌లాల్ నెహ్రూ వంటి ప్రముఖుల చిత్తరువులు గీసి ప్రశంసలు పొందారు. 'ది సాటర్‌డే ఈవెనింగ్ పోస్ట్' మ్యాగజైన్‌కు 50ఏళ్ల పాటు ఇల్లస్ట్రేటర్‌గా వ్యవహరించారు. సిల్వర్ బఫెలో అవార్డ్ పొందారు. నోర్మన్ రాక్‌వెల్ మ్యూజియంలో ఆయన గీసిన 700కుపైగా కళాఖండాలు, బొమ్మలు, పుస్తకాలు ఉన్నాయి. 1978 నవంబరు 8న కన్నుమూశారు.

అణ్ణాదురై (వర్ధంతి)



తమిళనాడు రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, 'అణ్ణా'గా పేరొందిన కాంజీవరం నటరాజన్ అణ్ణాదురై 1909 సెప్టెంబరు 15న కాంచీపురంలో జన్మించారు. మంచి వక్తగా పేరొందారు. దేశంలో అత్యధిక మెజారిటీతో కాంగ్రెసేతర తొలి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఘనత ఆయనదే. రచయితగా పలు నాటకాలు రాయడమే కాక నటించారు. ఆయన రచనలు కొన్ని సినిమాలుగా రూపుదిద్దుకున్నాయి. దూరదృష్టి గల నేతగా ఎన్నో సంక్షేమాలకు శ్రీకారం చుట్టారు. ద్రవిడ రాజకీయాలలో కీలకంగా వ్యవహరించారు. గురువు పెరియార్‌తో విభేదాలు రావడంతో సొంతంగా ద్రవిడ మున్నేట్ర కళగం పార్టీని స్థాపించారు. డీఎంకే పార్టీ తొలి జనరల్ సెక్రటరీగా సుదీర్ఘకాలం వ్యవహరించారు. ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, రాజ్యసభ సభ్యుడిగా పలు హోదాలలో కొనసాగారు. 1969 ఫిబ్రవరి 3న కన్నుమూశారు.

అల్లా రఖా (వర్ధంతి)



'పద్మశ్రీ' గ్రహీత ఖురేషి అల్లా రఖా ఖాన్ 1919 ఏప్రిల్ 29న జమ్ము - కశ్మీర్‌లో జన్మించారు. 'అల్లా రఖా'గా పేరొందారు. తబలా కళాకారుడైనా హిందూస్థానీ శాస్త్రీయ సంగీతంలో నిష్ణాతులు. ఎక్కువగా రవిశంకర్, బడే గులాం అలిఖాన్, అల్లావుద్దీన్ ఖాన్‌లకు వాద్యసహకారం అందించారు. తబలా కళాకారుడు ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ ఆయన కుమారులలో ఒకడు. సోలో గాయకుడిగాను, కంపోజర్‌గాను తనదైన గుర్తింపు పొందారు. తబలా వాద్య కళాకారుడిగా ప్రపంచవ్యాప్తంగా పేరొందారు. సంగీత నాటక అకాడమీ తదితర అవార్డులు పొందారు. 2003 ఫిబ్రవరి 3న కన్నుమూశారు.

వహీదా రెహమాన్ (పుట్టినరోజు)



'పద్మభూషణ్' గ్రహీత వహీదా రెహమాన్ 1938 ఫిబ్రవరి 3న తమిళనాడు రాష్ట్రం చెంగల్పట్టులో జన్మించారు. బాలీవుడ్‌లో పేరొందిన, అందమైన నటి. 1950, 60, 70 దశకాలలో వివిధ తరం నటులతో నటించారు. ప్రత్యేకించి 'గురుదత్' దర్శకత్వంలో ప్యాసా, కాగజ్ కే ఫూల్ తదితర సినిమాలు ఆమెకు గుర్తింపు తెచ్చాయి. తెలుగు, తమిళ, బెంగాలీ, మళయాళం భాషల సినిమాలలో సైతం నటించారు. ఒక జాతీయ, రెండు ఫిల్మ్‌ఫేర్, సెంటెనరీ అవార్డ్ ఫర్ ఇండియన్ ఫిల్మ్ తదితర పురస్కారాలు పొందారు. నటిగానే కాక మానవతావాదిగాను గుర్తింపు పొందారు.

రఘురామ్ రాజన్ (పుట్టినరోజు)




దేశంలో ప్రముఖ ఆర్థికవేత్తలలో ఒకరైన రఘురామ్ గోవింద రాజన్ 1963 ఫిబ్రవరి 3న భోపాల్‌లో తమిళ కుటుంబంలో జన్మించారు. చికాగో బూత్ స్కూల్ ఆఫ్ బిజినెస్ యూనివర్శిటీలో ప్రొఫెసర్. ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ (ఐఎంఎఫ్)కు 2003-06 మధ్య చీఫ్ ఎకనమిస్ట్‌గా, పరిశోధక డైరెక్టర్‌గా వ్యవహరించారు. రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియాకు 2013 నుంచి 2016వరకు 23వ గవర్నర్‌గా వ్యవహరించారు. లండన్ బిజినెస్ స్కూల్, హాంకాంగ్ యూనివర్శిటీ ఆఫ్ టెక్నాలజీలచే గౌరవ డాక్టరేట్‌లు అందుకున్నారు.

మంటల్లో పడి 55 గొర్రెలు మృతి


కంప్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్ర జ్యోతి): కూడ్లిగి తాలుకాలోని అమలాపురం గ్రామంలో శనివారం రాత్రి హగసర శేకరప్పకు చెందిన పొలంలో వేసుకున్న షెడ్డులో మంటలు ఏర్పడి 55 గొర్రెలు, మేకలు, పొట్టేళ్లు మృతి చెందాయి. ఇందులో గిరిజమ్మకు చెందిన 15 మేకలు, శేఖరప్పకు చెందిన 40 గొర్రెలు, మేకలు మృతి చెందాయి. రాత్రి షెడ్డుకు మంటలు ఏర్పడటంతో షెడ్లో మంటలు వ్యాపించినట్లు బాధితులు తెలిపారు. ఆదివారం తహసీల్దార్ రేణుక, పశుశాఖ జిల్లాఅధికారి లోహిత్, పోలీసుశాఖాధికారి జిలాన్ గ్రామ ప్రజలు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ విభేదాలు గానీ, మనసులో కక్ష వుంచుకుని ఎవరైనా మంటలు పెట్టినట్లయితే పోలీసు శాఖ గుర్తిస్తుందని, వారు ఎంతటివారైనా శిక్ష తప్పదన్నారు. బాధితులకు నష్ట పరిహారం అందేలా చూస్తామన్నారు.

పదాధికారుల నియామకం

కంప్లి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కంప్లి నియోజకవర్గం కంప్లి, కురుగోడు బీజేపీ పార్టీ తాలుకా కంప్లి అధ్యక్షులుగా మహదేవ, కురుగోడు అధ్యక్షులు మదిరి కుమారస్వామిలు ఎంపికైనట్లు బీజేపీ నాయకులు తెలిపారు. సోమవారం కంప్లి పట్టణంలో బీజేపీ తుంగభద్ర కార్యాలయంలో వీరికి అభినందన కార్యక్రమం నిర్వహించినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. పార్టీ అభివృద్ధికి వారు చేసిన కృషిని గుర్తించి వారిని తాలుకా అధ్యక్షులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు.



మహదేవ



కుమారస్వామి

కేన్సర్‌పై అవగాహనకు వాకథాన్



రామయ్య గ్రూప్ ఆధ్వర్యంలో వాకథాన్‌లో పాల్గొన్న ప్రజలు

బెంగళూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కేన్సర్ వ్యాధిపట్ల అవగాహన కల్పించేందుకు రామయ్య మెమోరియల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో 5కే వాకథాన్‌ను ఆదివారం జరిపారు. రామయ్య గ్రూప్ సంస్థల చైర్మన్ ఎంఆర్ జయరాం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోప్ ఏ థాన్ పేరిట సమాజంలో కేన్సర్ వ్యాధి పట్ల చైతన్యం కలిగించాలని వాకథాన్ ఏర్పాటు చేశామన్నారు. ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ ఎస్‌జీ నాగేంద్ర స్వామి మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాలకు వ్యాధులపట్ల అవగాహన ఉండాలన్నారు. కేవలం ఆసుపత్రులంటే చికిత్సలు మాత్రమే కాదని చైతన్యం కూడా కీలకమన్నారు. 500మంది వాకథాన్‌లో పాల్గొన్నారు.

అద్వైక కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో...

అద్వైక కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేన్సర్‌కు వ్యతిరేకంగా అవగాహన కల్పించేలా వాకథాన్ నిర్వహించారు. విధానసౌధ ముందు నుంచి కేఆర్ సర్కిల్, హడ్సన్ సర్కిల్, కస్తూర్బా రోడ్డు మీదుగా బాలభవన్ దాకా చేరింది. కర్ణాటక బయో ఇంధన అభివృద్ధి మండలి చైర్మన్ ఎస్ఈ సుధీంద్ర జెండా ఊపి ప్రారంభించారు. ప్రక్రియ ఆసుపత్రి సీఈఓ డాక్టర్ శ్రీనివాస్ చిలుకూరి, అద్వైకా ఫౌండేషన్ సీఈఓ రాకశ్రీ వారియర్, ట్రస్టు సభ్యులు బాల వారియర్ తదితరులు పాల్గొన్నారు



అద్వైక కేర్ ఫౌండేషన్ ప్రతినిధులు

సమయాన్ని వృథా చేయరాదు



నైపుణ్య శిబిరంలో డాక్టర్ కృష్ణమూర్తి తదితరులు

దొమ్మసంద్ర, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థిదశలో సమయం ఎంతో కీలకమని కావున వృథా చేయకుండా చక్కగా చదివి ఉన్నతహోదాలలో రాణించాలని చిదరంబరం అకాడమీ ఫౌండర్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ కృష్ణమూర్తి అభిప్రాయపడ్డారు. సర్జాపుర పట్టణంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విద్యాసంస్థలో పరీక్షల ఒత్తిడి నియంత్రనకు సంబంధించి నైపుణ్యశిబిరం నిర్వహించారు. పదో తరగతి, పీయూసీ విద్యార్థులను ఉద్దేశించి కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థి దశలో సమయాన్ని వృథా చేయరాదన్నారు. చక్కటి లక్ష్యంతో గౌరవం, పురస్కారం సాధ్యమన్నారు. విద్య, ప్రతిభతోనే గుర్తింపు లభిస్తుందన్నారు. పాఠశాల డైరెక్టర్ నారాయణస్వామి మాట్లాడుతూ సరిహద్దు ప్రాంతంలో 75 ఏళ్ల క్రితం పేదలకోసం విద్యాసంస్థ ఏర్పాటు చేశారన్నారు. ఇక్కడ చదివినవారు డీఎస్పీ, కేఏఎస్, ఇన్‌స్పెక్టర్, జడ్జ్, డాక్టర్, లేబర్ కమిషనర్ వంటి హోదాలలో కొనసాగుతున్నారన్నారు. టీచర్ అర్చన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులలో సైతం ఏదో ఒక ప్రతిభ ఉంటుందని వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానోపాధ్యాయుడు జగదీశ్ మాట్లాడుతూ పాఠాలతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక ధృడత్వం సాధ్యమని, ఒత్తిడి తగ్గుతుందన్నారు. ఈ సందర్భంగా యోగా టీచర్ స్వాతి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు అర్చన, న్యాయవాది మునియప్ప, డైరెక్టర్ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై మరింత బాధ్యత

చింతామణి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల విషయంలో తల్లిదండ్రులకంటే ఉపాధ్యాయులపై మరింత బాధ్యత ఉంటుందని కల్నల్ సందీప్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని చేళూరు రోడ్డులోని విక్రమ్ పాఠశాల వార్షికోత్సవం శనివారం సాయంత్రం జరిగింది. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించి మాట్లాడుతూ పిల్లలు ఎక్కువ సమయం పాఠశాలలో ఉపాధ్యాయులతో గడుపుతారన్నారు. పిల్లలపై ఉపాధ్యాయుల ప్రభావం ఉంటుందని కావున వారు ఆదర్శంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. పాఠాలు ఎంత ముఖ్యమో పాఠ్యేతర అంశాలు కూడా అంతే ప్రధానమన్నారు. విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో రాణించాలని తద్వారా దేహధారుడ్యం, ఆరోగ్యంపై చొరవ చూపాలన్నారు. లక్ష్మివిద్యాసంస్థ అధ్యక్షుడు నరసింహారెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ విద్యార్థులు సైతం పట్టణ విద్యార్థులకు దీటుగా ఉన్నతలక్ష్యంతో రాణించాలన్నారు. విద్యకు పేదరికం, ధనవంతులనే తేడా ఉండదన్నారు. జ్ఞానంతోపాటు మానవతా విలువలతో అలవాటు చేసుకోవాలన్నారు. వివిధ విభాగాల్లో ప్రతిభ చాటుకున్న విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. ఎన్‌సీసీ కమాండర్ లునిక్‌బాసు రాయ్, పాఠశాల అధ్యక్షుడు నరసింహా రెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ విజికుమార్, రూరల్ సీఐ శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.



వార్షికోత్సవంలో కల్నల్ సందీప్ తదితరులు

శ్రీకృష్ణదేవరాయల రథం ప్రారంభం



రథం ప్రారంభోత్సవంలో ధర్మాధికారి తదితరులు

చింతామణి రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయల 555వ జయంతిని పురస్కరించుకుని కర్ణాటక రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో సంచరించేలా శ్రీకృష్ణదేవరాయల భారీ రథానికి కైవార సద్గురు యోగినారేయణ మఠం ఆవరణలో ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం ప్రారంభించారు. యోగి నారేయణ తాతయ్య ఆలయంలో విశేషపూజలు నిర్వహించిన అనంతరం రథానికి పూజలు చేశారు. రాష్ట్ర బలిజయువశక్తి సంఘం అధ్యక్షుడు కేటీ రాజకుమార్ మాట్లాడుతూ దేశం గర్వించదగిన గొప్ప చక్రవర్తులలో విజయనగర సామ్రాజ్య సామ్రాట్ శ్రీకృష్ణదేవరాయల జయంతిని పురస్కరించుకుని కోలారు, చిక్కబళ్ళాపుర, తుమకూరు, బెంగళూరులలో సంచరించనుందన్నారు. ఈనెల 16న బెంగళూరు కేఆర్‌పురంలోని రాజీవ్‌గాంధీ క్రీడా మైదానం, ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ కళాశాల ఆవరణలో భారీ సమావేశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో యోగి నారేయణ మఠం సంకీర్తనా యోజనె సంచాలకులు వానరాశి బాలకృష్ణ భాగవతార్, సభ్యులు గణేశ్ చంద్రప్ప, కోలారు సురేశ్‌బాబు, సురేంద్రబాబు పాల్గొన్నారు.

గౌరీలంకేశ్ హత్యకేసు నిందితుల పేరిట బ్యానర్లు

» తొలగించిన స్థానికులు

బెంగళూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): సీనియర్ పాత్రికేయు రాలు, సామాజిక ఉద్యమకారిణి గౌరిలంకేశ్ హత్య కేసు నిందితుల ఫోటోలతో బ్యానర్లు ఏర్పాటు చేయడాన్ని హుబ్బళ్ళిలో స్థానికులు ఆదివారం తొలగించారు. నిందితులు పరశురామ్ వాగ్మోరె, మనోహర్‌యాదవ్ ఇటీవలే బెయిల్‌పై బయటకు వచ్చారు. విడుదలయ్యాక వారు హుబ్బళ్ళికి తొలిసారి వస్తుండడంతో హిందూసంఘాల కార్యకర్తలు సాదరంగా స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యారు. హుబ్బళ్ళి లోని సిద్ధారూఢ మఠానికి వెళ్లారు. తుళజా భవాని మందిరం వద్ద బ్యానర్లు ఏర్పాటు చేశారు. వాటిని దేవస్థానం పాలక మండలితో పాటు స్థానికులు కొందరు తొలగించారు. 2017 సెప్టెంబరు 5న బెంగళూరు రాజరాజేశ్వరినగర్ పరిధిలో గౌరి లంకేశ్‌ను తుపాకీతో కాల్చి హతమార్చిన విషయం తెలిసిందే. ఈ కేసులో అరెస్టు అయిన నిందితులు ఏడేళ్ల తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చారు. కేసులో 18మంది నిందితులు కాగా 17 మంది అరెస్టు అయి అందరూ బెయిల్‌పై విడుదలయ్యారు. 15వ నిందితుడు వికాస్ పటేల్ అలియాస్ దాదా పరారీలో ఉన్నాడు.



బ్యానరును తొలగిస్తున్న స్థానికులు

వైద్యసేవలు మరింత సరళీకృతం కావాలి



ఆసుపత్రి ప్రారంభంలో సిద్ధలింగస్వామిజీ తదితరులు

బెంగళూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సమాజంలో వైద్య సేవలు మరింత సరళీకృతం కావాల్సిన అవసరం ఉందని తుమకూరు సిద్ధగంగా మఠాధి పతి సిద్ధలింగ మహా స్వామిజీ అభిప్రాయపడ్డారు. ఆదివారం రాజరాజేశ్వరినగర్‌లో ఉళ్ళ ఎక్స్‌ప్రెస్ టీత్ ఇంప్లాంట్ చెయిన్ హాస్పిటల్‌ను ప్రారంభించారు. విభూతిపుర మఠాధిపతి మహాంతలింగ శివాచార్యస్వామిజీ, బెంగళూరు దక్షిణ ఎంపీ డాక్టర్ సీఎన్ మంజునాథ్, ఎమ్మెల్యే మునిరత్న, ఆసుపత్రి సీఈఓ డాక్టర్ నిరంజన పరమశెట్టి తదితరులు పాల్గొన్నారు. ఆసుపత్రిలో త్వరితగతిన చికిత్సలు అందాల్సి ఉందని సిద్ధలింగస్వామిజీ అభిప్రాయపడ్డారు. సీఈఓ నిరంజన మాట్లాడుతూ దంత ఇంప్లాంట్‌లో డెంటల్ సమస్యలతోపాటు బీపీ, షుగర్, హృదయ సంబంధిత పరీక్షలు జరుపుతామన్నారు. 28 ఏళ్లుగా కేడీసీ సంస్థ ద్వారా 10వేలకుపైగా డెంటల్ ఇంప్లాంట్‌ను చేశామన్నారు.

సజావుగా పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్ష ఎన్నికలు

ముళబాగిలు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక భూ అభివృద్ధి బ్యాంకు (పీఎల్‌డీ) అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు కోలారు ఎమ్మెల్యే కొత్తూరు జీ మంజునాథ్ మార్గదర్శకంలో ఏకగ్రీవంగా సజావుగా జరిగాయని కాంగ్రెస్ నాయకుడు వీ ఆదినారాయణ తెలిపారు. పట్టణ శివారులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షుడిగా ఎంపికైన గంగిరెడ్డి, ఉపాధ్యక్షుడు మండికల్ మంజునాథ్‌లను అభినందించి మాట్లాడారు. పీఎల్‌డీ బ్యాంకు రైతు వర్గాలకు ఎక్కువ రుణాలు ఇస్తుందని ఈ దిశగా నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులు కూడా అన్నదాతలకు అండగా ఉండాలన్నారు. కాంగ్రెస్ ఆవణి బ్లాక్ అధ్యక్షుడు ఎంసీ నీలకంఠే గౌడ మాట్లాడుతూ పీఎల్‌డీ బ్యాంకులో పదిమంది డైరెక్టర్‌లు కాంగ్రెస్ మద్దతుదారులు ఉండడంతో ఏకగ్రీవం సాధ్యమైందన్నారు. నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులు తమ విజయానికి సహకరించిన డైరెక్టర్లకు ధన్యవాదాలు తెలిపారు.



ప్రసంగిస్తున్న కాంగ్రెస్ నాయకుడు ఆదినారాయణ

దుబాయ్‌లో ప్రేమ - విజయపురలో పెళ్లి

» భార్య సొమ్ము దోచేసి పరారీ

బెంగళూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రేమ, పెళ్లి అంటే ఎంతో అన్యోన్యమైన అనుబంధం. కానీ ప్రేమ, పెళ్లి పేరిట మోసాలకు పాల్పడేవారు తరచూ తెరపైకి వస్తుంటారు. నాలుగేళ్లక్రితం దుబాయ్ దేశం ఖత్తార్‌లో కర్ణాటక రాష్ట్రం చిత్తాపురకు చెందిన యువతి ఉద్యోగం చేసేవారు. ఇదే సందర్భంగా ఆరీఫ్ అనే యువకుడితో ప్రేమ ఏర్పడింది. దుబాయ్‌లోనే మూడేళ్లపాటు కలసి ఉన్నారు. కర్ణాటకలోని సొంతూరుకు వెళ్లి సెటిల్ అవుదామంటూ నమ్మించారు. విజయపురకు రాగా ఆరీఫ్ కుటుంబ సభ్యులు ఇద్దరికీ పెళ్లి చేశారు. ఇలా సాగుతుండగా ఒక్కసారిగా యువతిపై దాడి చేసి ఆమె వద్ద ఉండే నగదుతోపాటు మొబైల్‌ను సైతం దోచుకుని పరారీ అయ్యాడు. పెళ్లి జరిగిన 20రోజుల్లోనే విడాకులు ఇచ్చేందుకు ఆరీఫ్ సిద్ధం కావడం, కుటుంబీకులు అందుకు ఒత్తిడి తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. విసుగుచెందిన యువతి విజయపుర గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తొలుత పోలీస్‌స్టేషన్‌లో ఆమెతో కలసి ఉంటానని నమ్మించి విజయపుర పట్టణం బురణాపురలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నివసిస్తుండేవారు. ఈలోగా మరోసారి గొడవ రావడంతో ఆరీఫ్ మరో ఇద్దరు బంధువులతో కలసి వచ్చి చాకుతో పొడిచేస్తానంటూ బెదరించి నగదు, నగలు, మొబైల్‌ను దోచుకుని పరారీ అయ్యాడు. ఘటనపై విజయపుర గ్రామీణ పోలీసులు శనివారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గడిదంలో పాండురంగడి బ్రహ్మ రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

బాగేపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని గడిదం కొండపై కొలువైన పాండు రంగస్వామి బ్రహ్మ రథోత్సవం వైభవంగా ఆదివారం జరిగింది. మాఘ మాసంలో తొలి ఆదివారం రుక్కుబాయి సమేత పాండు రంగస్వామిలకు రథోత్సవం నిర్వహించడం ఆన వాయితీగా వస్తోంది. ఉదయం విశేషపూజలు నిర్వ హించారు. అనంతరం ఉత్సవ మూర్తులను అలంకరించిన రథంపై కొలువుదీర్చారు. పురవీధులలో రథోత్సవం కొనసాగింది. తొలుత గణపతి పూజ, పంచామృతాభిషేకం, గోపూజ, ఇతర కైంకర్యాలు, హోమాదికాలు నిర్వహించారు. అనంతరం భక్తుల గోవింద నామస్మరణ మధ్య రథోత్సవం జరిగింది. చుట్టుపక్కల గ్రామస్తులు, యువకులు ప్రసాదం, తాగునీటి వ్యవస్థ కల్పించారు. బాగేపల్లి పట్టణంతోపాటు బెంగళూరు, సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్ ప్రాంత భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు.

రక్తదానం.. మహాదానం..

మహదేవపుర, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రక్తదానం మహాదానమని తద్వారా మరొకరి ప్రాణాలు కాపాడినవారు అవుతారని సమాజసేవకుడు వర్తూరు సత్య అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో మాజీ మంత్రి అరవింద లింబావళి పుట్టినరోజును పురస్కరించుకుని రాష్ట్రోత్తాన రక్తనిధి కేంద్రం సహకారంతో రక్తదాన శిబిరం, 500మంది విద్యార్థులకు స్కూల్‌బ్యాగులు, రాత సామగ్రి 150మంది మహిళలకు చీరలు పంపిణీ ఇతర సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలు ప్రదానం చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఇతరులకు మాదిరిగా నిలవాలన్నారు. రక్తదానం ద్వారా మన ఆరోగ్యంలో ఎటువంటి సైడ్ ఎఫెక్ట్ ఉండవన్నారు. యువకులు రక్తదానంలో మరింత చురుగ్గా పాల్గొనాలన్నారు. నిర్వాహకులు ఎల్ రాజేశ్ మాట్లాడుతూ యువకులు ఆరు నెలలకోసారి రక్తదానం చేయడం ద్వారా కొత్త రక్తకణాలు ఉత్పత్తి అవుతాయన్నారు. ఈ సందర్భంగా పట్టణ హోబళి బీజేపీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, రాష్ట్ర పరిషత్ సభ్యుడు ఎల్ రాజేశ్, ప్రముఖులు మోది, వర్తూరు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

మహిళలతో సరదా చాలెంజ్... 4 లక్షలు కోల్పోయిన వైనం

బెంగళూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మహిళతో సరదాగా మాట్లాడేందుకు వెళ్లి వారు చాలెంజ్‌కు సిద్ధం కావడంతో ఏకంగా 4 లక్షల రూపాయలు కోల్పోయిన సంఘటన కోలారు కారంజికట్టె ప్రదేశంలో జరిగింది. కోలారులోని ఓ కుటుంబం రాత్రి భోజనం తర్వాత గుంపుగా చేరి మాట్లాడుకుంటున్నారు. కేదార్‌నాథ్, బద్రీనాథ్ వెళ్లాలని చర్చించుకుంటున్నారు. అంతలోనే స్థానికుడు ఒకరు ఇదంతా మహిళలతో సాధ్యం కాదని మీరు కేదార్‌నాథ్ వెళ్తే కిలోమీటర్ల దూరం వెళ్లాలని, ఇక్కడనుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉండే నరసాపురకు వెళ్లలేరంటూ చాలెంజ్ వేశారు. నరసాపురదాకా నడిస్తే ఒక్కొక్కరికి 10 గ్రాముల బంగారం ఇస్తానన్నారు. మహిళలంతా చాలెంజ్‌గా తీసుకున్నారు. మంగళవారం రాత్రి 10.45 గంటలకు నడవడం ప్రారంభించారు. ముందో కారు, వెనుకో కారు తోడుగా వెంట వచ్చాయి. రాత్రి 1.10 గంటలకు నరసాపురకు చేరుకున్నారు. దీంతో చాలెంజ్ చేసిన వ్యక్తి షాక్ అయ్యాడు. నిబంధనల ప్రకారం ప్రతి మహిళకు రూ.50వేలు చొప్పున మొత్తం రూ.4లక్షలు ఇచ్చాడు. మిగిలిన సొమ్ము తర్వాత ఇస్తానని హామీ ఇచ్చారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ చాలెంజ్‌కోసం లక్షల రూపాయలు కోల్పోయిన విషయం సర్వత్రా హల్‌చల్ చేస్తోంది.

అంతర్రాష్ట్ర నిందితుల అరెస్టు

బంగారపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కామసముద్రం పోలీసులు హర్యానాకు చెందిన ముగ్గురు అంతర్రాష్ట్ర నిందితులను అరెస్టు చేసి వారినుంచి రూ.7.60లక్షల విలువైన నగలను, సొత్తును స్వాధీనం చేసుకున్నారు. తాలూకాలోని మంకీక్యాప్ దొంగల బెడద ఇటీవల అధికమైంది. ఈ గ్యాంగ్ ఆచూకీ కోసం కామసముద్రం ఎస్సై కిరణ్ కుమార్ నేతృత్వంలోని బృందం కార్యాచరణ నిర్వహించి ఎట్టకేలకు అరెస్టు చేసింది. హర్యానా రాష్ట్రం మేవక్ జిల్లాకు చెందిన ఖాదర్‌బాషా (35), ఆరిఫ్ (39), ముస్తాక్‌ఖాన్ (36)లను అరెస్టు చేశారు. వీరిపై బంగారపేట, కామసముద్ర, రాబర్ట్‌సన్‌పేట, బేతమంగల, కోలారు రూరల్, బెంగళూరు రూరల్, సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా పుంగనూరు, నదుం పోలీస్‌స్టేషన్‌లలో 12 కేసులలో వీరి భాగస్వామ్యం ఉన్నట్టు గుర్తించారు. నిందితులనుంచి నగలు, వెండికాలి పట్టీలు, ఒక పల్సర్‌బైక్, ఒక హీరోఫ్యాషన్‌ప్లస్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టు ముందు హాజరు పరచగా జ్యుడీషియల్ కస్టడీకి ఆదేశించినట్టు పోలీసులు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న సొత్తుతో పోలీసులు

హుణసనహళ్లి సహకార సంఘం అధ్యక్షుడిగా మాదేశగౌడ

బంగారపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని హుణసనహళ్లి వివిధ ఉద్దేశ్య ప్రాథమిక వ్యవసాయ గ్రామీణ సహకారసంఘం పాలకవర్గానికి నూతన అధ్యక్షుడిగా మాదేశగౌడ, ఉపాధ్యక్షుడిగా నారాయణప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 12మంది డైరెక్టర్ల మద్దతుతో మాదేశ్‌గౌడ, నారాయణప్పలు మాత్రమే నామినేషన్ సమర్పించడంతో ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారి బాలకృష్ణ ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన డైరెక్టర్ హెచ్ఆర్ శ్రీనివాస్ మాట్లాడుతూ అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నికల్లో బీజేపీ మద్దతుదారుల సహకారంతో విజయం సాధ్యమైందన్నారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో సహకారసంఘాలకు సున్నా వడ్డీతో రూ.5లక్షలకు రుణాలు సాధ్యమని ప్రకటించడంతో ఈ ఏడాది సంఘం సభ్యులకు మరింత సహకారం కానుందన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మునిస్వామి, కెంపణ్ణ, ఎం గోవిందప్ప, శంకరప్ప, మునియమ్మ, వీణా, నారాయణస్వామి, లక్ష్మమ్మ, సంపంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.